క్లుప్తంగా

అల్లు అర్జున్‌కు అవార్డుపై హర్షం

అమలాపురం టౌన్: తెలుగు నటుడికి తొలిసారిగా లభించిన జాతీయ ఉత్తమ నటుడు అవార్డు అల్లు అర్జున్‌కు దక్కడం ఆయన నటనా ప్రతిభకు పట్టం కట్టడమేనని శ్రీశ్రీ కళావేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలో శ్రీశ్రీ కళావేదికకు చెందిన కవులు, రచయితలు, కళాకారులు, వాకర్స్ నటుడు అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడు అవార్డు లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం కేక్ కట్ చేసి జరుపుకున్న సంబరాల్లో నానిరాజు మాట్లాడారు. సినీ నటుడు గుర్రం రామకృష్ణారావు, పలు సంస్థల ప్రతినిధులు తేతల సత్యనారాయణరెడ్డి, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, జల్లి సుజాత, బీవీవీ సత్యనారాయణ, జంగా రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

అభిమానుల సంబరాలు

అమలాపురం రూరల్: అల్లు అర్జున్ జాతీయ ఉత్తమ నటుడు అవార్డు గెలుచుకున్న సందర్భంగా అభిమానులు సంబరాలు చేశారు. టౌన్ వైడ్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కొంకాపల్లిలోని హరిమనో వికాసకేంద్రం మానసిక వికలాంగుల పాఠశాలలో అధ్యక్షుడు వర్రే శేషు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మానసిక వికలాంగులకు పండ్లు పంచిపెట్టి భోజన సదుపాయం కల్పించారు. చిరంజీవి యువత నాయకులు నల్లా చిట్టిబాబు, యేడిద శ్రీను, నల్లా నాయుడు, యర్రంశెట్టి లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేటి నుంచి పరదేశమ్మ జాతర


తాళ్లరేవు గ్రామదేవత పరదేశమ్మ అమ్మవారు

తాళ్లరేవు: గ్రామ దేవత శ్రీ పరదేశమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు పరదేశమ్మపేటలోని ఆలయాన్ని ముస్తాబు చేశారు. స్థానిక జెల్లావారిపేట అంగన్ గుడిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం అమ్మవారి జాతర మహోత్సవం, ఆదివారం అమ్మవారి తీర్థ మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి జాతర మహోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

నేడు రక్తదాన శిబిరం

తాళ్లరేవు: మానవతామూర్తి మదర్ థెరిసా జయంతి సందర్భంగా శనివారం తాళ్లరేవులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తాళ్లరేవు సామాజిక ఆస్పత్రి డైరెక్టర్ బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు, గొల్లపాలెం లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి స్థానిక సామాజిక ఆస్పత్రి ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు.

అన్నదానానికి రూ.25 వేల విరాళం


అన్నదాన ట్రస్టుకు విరాళం అందజేస్తున్న దాత సూర్యనారాయణరాజు దంపతులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే అన్నదాన ట్రస్టుకు శుక్రవారం మురమళ్ల గ్రామానికి చెందిన సరిపెళ్ల సాయి సూర్యనారాయణరాజు, త్రివేణి దంపతులు రూ.25 వేలు ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణకు అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేష వస్త్రంను ఆలయ అర్చకుడు ఉండి దత్తు అందజేశారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రూ.25 వేల విరాళం


దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి అమెరికాలో స్థిరపడిన కె.శ్రీనివాసరావు-సత్యశ్రీలక్ష్మి దంపతులు రూ.25 వేల విరాళం అందించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతలకు ఆలయ చైర్మన్ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

రుచి మధురం.. ధర సరసం

- ఫిష్ ఆంధ్రతో నాణ్యమైన ఉత్పత్తులు
- వినియోగదారుల ఆనందం

కాట్రేనికోన: మాంసాహార ప్రియులకు నాణ్యమైన మత్స్య ఉత్పత్తులను సరసమైన ధరలకు అందించాలనే ధ్యేయంతో ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా మినీ ఔట్‌లెట్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. సముద్ర జలాలు, చెరువులు, గోదావరి పాయల్లో వేటాడిన చేపలు, రొయ్యలు చెడిపోకుండా నిల్వ ఉంచేందుకు అవసరమైన ఐస్ బాక్సులను మత్స్య కార్మికులకు ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందిస్తుంది. మాంసాహార ప్రియులకు నాణ్యమైన, రుచికరమైన చేపలు, రొయ్యలు, పీతలు వంటి మత్స్య ఉత్పత్తులను ఫిష్ ఆంధ్రా కేంద్రాలలో అందుబాటులో ఉంచింది. ఫిష్ ఆంధ్రా యూనిట్ రూ.1,00,000కు గాను 10 శాతం లబ్ధిదారుని షేరు ధనంతో 90 శాతం రాయితీపై మత్స్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం మంజూరు చేసింది. మండలంలో 19 ఫిష్ ఆంధ్రా యూనిట్స్‌ను అందుబాటులోకి తెచ్చిన మత్స్యశాఖ వేట్లపాలెంలో సుమారు రూ.2 కోట్లతో ఆక్వా హబ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తోంది. మాంసాహార ప్రియులకు నాణ్యమైన ఉత్పత్తులు అందిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తోంది. ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా యూనిట్‌లో అవసరమైన ఫ్రీజర్, ఐస్ బాక్స్‌లు, వేయింగ్ మెషీన్, కటింగ్ టేబుల్, కట్టర్ వంటి వస్తువులు అందిస్తోంది. ఫిష్ ఆంధ్రా మినీ ఔట్‌లెట్లలో చెరువు చేపలు, రొయ్యలు, లైవ్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. అధిక ధరలకు కళ్లెం వేస్తూ ఫిష్ ఆంధ్రా కేంద్రాలలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే మత్స్య ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. నాణ్యమైన ఎండు చేపలు, రొయ్యలను సరసమైన ధరలకు ఫిష్ ఆంధ్రా కేంద్రాలలో అమ్మకాలు చేస్తున్నారు. దీంతో వినియోగదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కందికుప్పలో ఫిష్ ఆంధ్రా మినీ ఔట్‌లెట్

ఉపాధి పొందుతున్నాం



ప్రభుత్వం 90 శాతం రాయితీపై ఫిష్ ఆంధ్రా యూనిట్‌ను మంజూరు చేయడంతో వ్యాపారం చేసుకునేందుకు పెట్టుబడి దొరికింది. ప్రభుత్వం అందించిన ఆర్థిక చేయూతతో ఫిష్ ఆంధ్రా మినీ ఔట్ లెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నాం. రుచికరమైన నాణ్యమైన చేపలను వినియోగదారులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్మకాలు చేస్తున్నాం.

– అర్ధాని లోవరాజు, పల్లం (ఫిష్ ఆంధ్రా కేంద్రం)

సరసమైన ధరలకు నాణ్యమైన చేపలు

ఫిష్ ఆంధ్రా కేంద్రాలలో నాణ్యమైన చేపలు, రొయ్యలు, పీతలు సరసమైన ధరలకు దొరుకుతున్నాయి. నాణ్యమైన ఎండు చేపలు, రొయ్యలు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు దొరుకుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టిక ఫిష్ ఆంధ్రా షాపులలో ఉండటం వల్ల మోసపోయేందుకు అవకాశం లేదు.

– గుత్తుల వెంకటరమణ

క్రీడాకారులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

ఘనంగా 'సాయ్'లో జాతీయ క్రీడాదినోత్సవం


బహుమతులు అందజేస్తున్న సాయ్ ప్రతినిధులు

యానాం: క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని దానికి నిరంతరం కృషి అవసరమని పలువురు పేర్కొన్నారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) అకాడమీ యానాం శాఖ ఆధ్వర్యంలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 23 నుంచి 25 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యంగా 7పిక్స్, లెగ్‌క్రికెట్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలను, వెటరన్స్‌కు వాకింగ్‌రేస్‌ను నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, సుభాష్‌చంద్రబోస్, చంద్రశేఖర్‌అజాద్ గ్రూపులుగా విడదీసి పోటీలను నిర్వహించగా సుభాష్‌చంద్రబోస్ గ్రూపు మేజర్ ధ్యాన్ చంద్ ట్రోఫీని కైవసం చేసుకుంది. మెరిమట్టి మెరెదేశ్, రిటైర్డ్ ఎయిర్‌ఫోర్స్ నల్లం నాగేశ్వరరావు, సెంటర్ ఇన్‌చార్జి జి. లింగేశ్వరరావు పాల్గొన్నారు.

డిపాజిటర్లలో కోపరేటివ్ సొసైటీలు
నమ్మకం కలిగించాలి

యానాం: సహకార సొసైటీల బ్యాంకులు డిపాజిటర్లలో నమ్మకాన్ని కల్గించడం ద్వారా మరింత అభివృద్ధి పథంలో నడుస్తూ ఉత్తమమైన సేవలు అందించవచ్చునని ది సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం యానాం బ్రాంచిలో ఏర్పాటు చేసిన ఖాతాదారుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. 26 ఏళ్ల నుంచి సేవలు అందిస్తున్న సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకు 5 రాష్ట్రాల్లో 42 శాఖలు కలిగి ఉందని, గత ఏడాది రూ.64 కోట్లు లాభం రాగా ఈ ఏడాది రూ.70కోట్లకు పైబడి వచ్చిందన్నారు. చైర్మన్ పీఆర్‌వీపీఎస్‌రాజు, డైరెక్టర్ జె.సత్యనారాయణ, బ్రాంచి మేనేజర్ కాశి అశోక్‌కుమార్, పారిశ్రామికవేత్త ఈలప్రోలు విష్ణువర్ధనరావు, రిటైర్డ్ ఆర్ఏఓ నామాడి అప్పారావు, పొనుగు మట్ల విష్ణుమూర్తి, అడ్వకేట్ నటరాజ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ వెంకటసుబ్బయ్య

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

- ఇంటింటా పూజల సందడి
- ఆలయాల్లో సామూహిక పూజలు

ఐ.పోలవరం: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా గ్రామాల్లో లోగిళ్లు ఆధ్యాత్మిక శోభతో సందడిగా మారాయి. తెల్లవారుజాము నుంచే మహిళలు వరలక్ష్మీ వ్రతం, శ్రావణ శుక్రవార పూజలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ మాసంలో ఇంటి వద్ద లక్ష్మీదేవి వ్రతం ఆచరిస్తే సిరి సంపదలు కలుగుతాయన్నది ప్రజల విశ్వాసం. ఈ నేపథ్యంలో భక్తులు తమ ఇంట సిరులు పండించాలని, సకల సౌభాగ్యాలు ప్రసాదించమని అమ్మవారిని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. దీనిలో భాగంగా ఇళ్లలోనే ప్రత్యేక మంటపాన్ని ఏర్పాటు చేసి అమ్మవారిని కొలువుదీర్చి శాస్త్రోక్తంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. తమ పసుపు కుంకుమలను కాపాడాలని, అష్టైశ్వర్యాలతో తులతూగేలా చూడాలని కోరుతూ భక్తి శ్రద్ధలతో వ్రతాలు, పూజలు నిర్వహించారు. తమ శక్తి కొద్దీ తయారుచేసిన పిండి వంటలు సమర్పించి వరలక్ష్మీ అమ్మవారిని ఘనంగా పూజించారు. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో భద్రకాళీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని కొమరగిరి కనకదుర్గ అమ్మవారి ఆలయంలో, జి.మూలపాలెం అమ్మవారి ఆలయంలో అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేసుకొన్నారు.


శ్రావణ వరలక్ష్మీదేవిగా అలంకృతమైన అమలాపురం శ్రీదేవి అమ్మవారు

శ్రావణ వరలక్ష్మిగా శ్రీదేవి అమ్మవారు

అమలాపురం టౌన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా అమలాపురం శ్రీదేవి మార్కెట్‌లో గల శ్రీదేవి అమ్మవారి ఆలయం శ్రావణ శోభతో కళకళలాడింది. అమ్మవారిని శ్రావణ వరలక్ష్మీదేవిగా అలంకరించడంతో వేలాది మంది భక్తులు తరలి వచ్చి దర్శించుకున్నారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, వరలక్ష్మీ వ్రతం జరిగాయి.


పాత బండారులంక లో సామూహిక లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సామూహిక లక్ష కుంకుమార్చన

అమలాపురం రూరల్: పాత బండారులంక బిళ్ళ వారి వీధిలో వేంచేసియున్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి మందిరం ఆవరణలో శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం మహిళలు సామూహిక లక్ష కుంకుమార్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీనివాస బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ జరిగిన ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలందరికీ వరలక్ష్మి అమ్మవారి డాలర్, గాజులు, జాకెట్, లడ్డు ప్రసాదం అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు అంకం హిమ భారతి, శ్రీనివాస బాల మిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, బిళ్ళ విశ్వేశ్వరరావు, అంకం పెదరాజు, కడలి పాల్గొన్నారు.

యానాంలో..

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో వరలక్ష్మీవ్రత పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ శుక్రవారం కావడంతో వరలక్ష్మీదేవికి అత్యంత ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. స్థానిక గోపాల్‌నగర్ సమీపంలో రామరాజుగార్డెన్‌లో నూతనంగా నిర్మించిన శ్రీధనలక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి చింతాశివ, నాగరత్నకుమారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చింతా సత్యప్రసాద్, నల్లం సురేష్, పెదపాటి కృష్ణ భక్తుల సహకారంతో రజత వస్త్రం సంప్రోక్షణ చేసి అమ్మవారికి అలంకరించారు. స్థానిక పడవల రేవువీధిలో లలితాదేవి ఆలయంలో అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

ఉప్పలగుప్తం: శ్రావణమాస శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గొల్లవిల్లి యల్లారమ్మ ఆలయం, విలసవిల్లి కనకదుర్గ ఆలయం, చినగాడవిల్లి వైష్ణవి దుర్గ ఆలయం, పెదగాడవిల్లి రేణుక ఎల్లమ్మ, వానపల్లిపాలెం విజయదుర్గ ఆలయాల్లో అమ్మవార్ల విగ్రహాలకు ఆకర్షణీయంగా పుష్పాలతో ప్రత్యేకంగా అలకరించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


యానాం త్యాగరాజ వీధిలో దుర్గాదేవి దర్శనానికి పోటెత్తిన భక్తులు


జి.మూలపాలంలో అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

విద్యుత్ బిల్లుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సర్వీసు పేరుపై ఉన్న ఆధార్ కార్డు నంబరును అనుసంధానం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ సోమేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఆధార్‌కార్డు నంబరును ఈపీడీసీఎల్ యాప్ ద్వారా, ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా, గ్రామ సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్ వద్ద ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలన్నారు. ఆధార్ నంబరును అనుసంధానం చేసుకొంటేనే ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతాయన్నారు.

ఉప్పలగుప్తం: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులకు ఆధార్ అనుసంధానం చేయాలని ఉప్పలగుప్తం మండల విద్యుత్ ఏఈ శ్రీహరి తెలిపారు. డీఈఈ రవికుమార్ ఆదేశాల మేరకు ఆధార్ అనుసంధానం చేయడానికి మండలంలోని కూనవరం, చల్లపల్లి, ఉప్పలగుప్తం, పెదగాడవిల్లి, గొల్లవిల్లి, ఎస్.యానం గ్రామాల్లో 26, 27 తేదీల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని వినియోదారులు సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

అమలాపురం రూరల్: విద్యుత్ బిల్లులను వినియోగదారులు ఆధార్‌కి అనుసంధానం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోకా రవికుమార్ తెలిపారు. శనివారం, ఆదివారం అమలాపురం మండలంలోని పంచాయతీ కార్యాలయాల్లో విద్యుత్ ఉద్యోగులు అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 9 నుంచి సాయత్రం 5గంటల వరకు పంచాయతీ కార్యాలయాల్లో విద్యుత్ సిబ్బంది కరెంట్ బిల్లుకు ఆధార్ కార్డులను అనుసంధానం చేస్తారన్నారు.

డెంగీ టెస్టింగ్ కిట్‌ల అందజేత

యానాం: నియోజకవర్గ పరిధిలో డెంగీ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా శుక్రవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆర్థిక సహకారంతో డెంగీ టెస్టింగ్ కిట్లను, దోమల నివారణా మందులను ప్రభుత్వ ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా 200 డెంగీ టెస్టింగ్ కిట్లు, 50 లీటర్ల దోమల నివారణ పిచికారీ మందును అందజేశారు. జీజీహెచ్ డీడీ రవిశంకర్, ఏడీ సానియాల్ కుమార్, డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

తాపేశ్వరం రోడ్డు పనులు పునఃప్రారంభం


మొదలైన తాపేశ్వరం రోడ్డు పనులు

మండపేట: తాపేశ్వరం రోడ్డు పనులు శుక్రవారం పునః ప్రారంభమయ్యాయి. సాంకేతిక కారణాలు, నిధుల విడుదలలో జాప్యం వల్ల ఏడు నెలలుగా ఈ రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయిన విషయం విదితమే. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఉన్నతాధికారులతో మాట్లాడి బిల్లుల విడుదల చేయించి పనులు ముందుకు సాగేందుకు ఉన్న అవరోధాలను తొలగించారు. గురువారం రోడ్డు పనులు పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్అండ్ బీ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ అదికారులు పనులు మొదలు పెట్టడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పనపాడు వద్ద రెండో వైపు రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తిరుశూల శ్రీనివాసు, స్థానిక నాయకులు పనులను పర్యవేక్షించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు కృషిచేస్తున్నామని ఆర్అండ్‌బీ జేఈ సూర్యనారాయణ తెలిపారు.

తడి–పొడి వ్యవసాయంపై రైతులకు అవగాహన


యనమదలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త నరసింహారెడ్డి

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదలలో హైదరాబాద్‌కు చెందిన కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు తడి–పొడి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్త నరసింహారెడ్డి నీటి అవసరం ఎక్కువగా ఉన్న వరి పంటలో నీటి అవసరం తగ్గించుకునే వీలుతో పాటు వరి పంట నుంచి విడుదలయ్యే విష వాయువు మీథేన్ ఉత్పత్తిని తగ్గించే అవకాశం ఉన్న తడి–పొడి వ్యవసాయ విధానంపై వివరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు చెల్లుబోయిన నరేన్ మాట్లాడుతూ నీటి అవసరం 20 శాతం వరకు తగ్గించుకునే వెసులుబాటు ఉన్న ఈ విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్, సర్పంచ్ పంపన వీరవెంకటరమణ, ఎంపీటీసీ నురుకుర్తి శ్రీరామకృష్ణ, మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ మల్లెల కొండారెడ్డి, కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్ సంస్థ రామచంద్రపురం మండల కోఆర్డినేటర్ తుట్టా సుబ్రహ్మణ్యం, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

28 వేల ఎకరాల్లో ఈ–పంట నమోదు పూర్తి


ఊడిమూడిలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

పి.గన్నవరం: ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో ఇప్పటికి 28 వేల 350 ఎకరాల్లో ఈ–పంట నమోదు కార్యక్రమం పూర్తయిందని జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు తెలిపారు. జిల్లాలో 1.7 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని, ఇప్పటికి 1.5 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారని ఆయన వివరించారు. నూతన విధానంలో ప్రవేశపెట్టిన యాప్ ద్వారా మండలంలోని ఊడిమూడి గ్రామంలో జరుగుతున్న ఈ–పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన వ్యవసాయ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం బోసుబాబు విలేకరులతో మాట్లాడారు. ఈ–పంట నమోదుపై గ్రామ సభల ద్వారా అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. వచ్చే నెలాఖరులోగా ఈ–పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో పి.గన్నవరం ఏడీఏ జేఎస్‌వీ రామ్మోహన్‌రావు, ఏఓలు కల్యాణ్ సూర్యకుమార్, పవన్‌కుమార్, సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్బీకేలతో రైతులకు మెరుగైన సేవలు

రాజోలు: ఆర్బీకేల ద్వారా వ్యవసాయశాఖ రైతులకు మెరుగైన సేవలు అందిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని చింతలపల్లి, శివకోటి గ్రామాల్లోని ఆర్బీకేలను ఆయన పరిశీలించారు. ఈ–క్రాప్ నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల కోసం అందుబాటులో ఉంచిన ఎరువుల గొడౌన్లలో నిల్వలను తనిఖీ చేశారు. ఈ–క్రాప్ నమోదు లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చింతలపల్లి, శివకోటి గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులతో వరిసాగులో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంటబీమా, గిట్టుబాటు ధర, ఎరువులు, పురుగుమందులు, వైఎస్సార్ యంత్రసేవా పథకాలపై అవగాహన కల్పించారు. ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఏఓ వై.మధుకుమార్, వీఏఏలు చంద్రశేఖర్, వర్మ, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటినీ సమగ్ర సర్వే చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ ప్రభాకర్

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారునికి సక్రమంగా అందుతున్నాయా లేదా ఏ పథకాలు అందుతున్నాయి అనే విషయాలను ప్రతి ఇంటికీ వెళ్లి సమగ్ర సర్వే చేయాలని వలంటీర్లను ఆదేశించినట్లు కొత్తపేట డీఎల్‌డీవో ఎం.ప్రభాకర్ చెప్పారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిటిజన్ అవుట్‌రీచ్ ప్రోగ్రాం (సీఓపీను ప్రతి గ్రామంలోనూ నిర్వహిస్తున్నామన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు ఏ మేరకు లబ్ధిదారునికి చేరాయో తెలుసుకునేందుకు ఈ ప్రోగ్రాంను ప్రవేశపెట్టారన్నారు. వలంటీర్‌తో పాటు సచివాలయ ఉద్యోగి ఒకరు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారన్నారు. అర్హులై ఉండి సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందని వారికి లబ్ధి చేకూర్చారన్నారు. లబ్ధిదారుల ఖాతాలో పథకాలకు సంబంధించిన సొమ్ములను జమ చేశారన్నారు. మండలంలో 19 సచివాలయాలకు 8 సచివాలయాల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. వెల్నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలకు సంబంధిచి ఆయా భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. త్వరలో వాటి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. డీఎల్‌డీఓ వెంట ఎంపీడీఓ కె.సత్యనారాయణ ఉన్నారు.

సేవలతోనే గుర్తింపు

మామిడికుదురు: మగటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కె.హరనాథ్ 14 ఏళ్లు సుదీర్ఘంగా సేవలందించారని సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి పేర్కొన్నారు. హెచ్ఎంగా పని చేస్తూ పెదపట్నంలంక బదిలీ అయిన హరనాథ్, సూర్యభవాని దంపతులను శుక్రవారం స్థానికులు ఘనంగా సత్కరించారు. సభలో సర్పంచ్ లక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా 8 ఏళ్లు, హెచ్ఎంగా 6 ఏళ్లు మొత్తం 14 ఏళ్లు హరనాథ్ పని చేశారని చెప్పారు. విద్యార్థులను క్రమశిక్షణతో చదివించారని పేర్కొన్నారు. ఇతనితో పాటు పాఠశాల నుంచి ఇటీవల బదిలీ అయిన నలుగురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మట్టా గంగయ్య, పీఏసీఎస్ చైర్మన్ బొలిశెట్టి భగవాన్, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు సూరిశెట్టి బాబి, హెచ్ఎం కస్తూరి హనుమంతరావు, స్థానికులు కలిగితి పళ్లంరాజు, నామన నాగేశ్వరరావు, కలిగితి రామకృష్ణ పాల్గొన్నారు.